ప్రజాశక్తి
శనివారం 2 నవంబర్ 2024
5
విజయనగరం

'గుర్లగెడ్డ'కు నిధులు కేటాయించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి

ప్రజాశక్తి-గజపతినగరం

గుర్లగెడ్డ ప్రాజెక్టును సిఎం చంద్రబాబునాయుడు పరిశీలించి, పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. గజపతినగరం ప్రాంతంలో అతిచిన్న నీటి ప్రాజెక్టు గుర్లగెడ్డ అని, రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం మధ్యస్థంలోనే ఉంచారని, స్పీల్ వే నుండి కొండకు గట్టు పూర్తి చేయలేదని, దీంతో నీరు నిల్వ ఉండడం లేదని తెలిపారు. అటవీశాఖ అనుమతులు లేవనే నెపంతో ఇన్నాళ్లుగా గట్టును పూర్తి చేయలేదన్నారు. ఈ చర్య రైతులకు అన్యాయం చేయడమేనని స్పష్టంచేశారు. రైతులకు తగు న్యాయం చేయడానికి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, పూర్తిచేయాలని సిఎంను కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, మెంటాడ మండల కార్యదర్శి రాకోటి రాములు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

- రహదారుల మరమ్మతు పనులకు శ్రీకారం
- పురిటిపెంట వద్ద పనులు ప్రారంభం
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/గజపతినగరం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 11గంటలకు సిఎం జిల్లాకు రానున్నారు. గజపతినగరం మండలం పురిటిపెంట వద్ద రహదారి మరమ్మతు పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. గంగచోళ్లపెంట గ్రామం వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడే వివిధ శాఖల అధికారులతో సిఎం సమీక్షించనున్నారు. అనంతరం మీడియా సమావేశంలో పాల్గొంటారు. పాట్ హోల్ ఫ్రీ రహదారులే లక్ష్యంగా సుమారు 826కోట్ల రూపాయలతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రహదారుల మరమ్మతు పనులను ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే ప్రారంభించనున్నారు. ఈ పనుల నిర్వహణలో ఆయన స్వయంగా పాల్గొంటారు. దీనిలో భాగంగా గజపతినగరం నుంచి మెంటాడ రహదారిలో సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి పనులను రూ.37 లక్షలతో పనులు చేపడతారు. జిల్లాలో మొత్తం 80 కిలోమీటర్ల మేర 73 పనులకు గానూ రూ.10.5 కోట్లతో మరమ్మతులు చేస్తారు. కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తుపై ఎస్పి వకుల్ జిందాల్‌తో చర్చించారు. హెలిప్యాడ్ ను పరిశీలించారు. సిఎం సమీక్షా సమావేశాన్ని నిర్వహించే సమావేశ మందిరంలో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కాన్వాయ్ ట్రైయిల్ రన్ నిర్వహించారు. ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పర్యటనలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, సిపిఓ పి.బాలాజి, ఆర్అండ్‌బి ఎస్ఇ బి.కాంతిమతి, జిల్లా అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో రూ.10.54 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్ల పనులు

రాష్ట్రంలో గుంతల రోడ్లకు స్వస్తి పలికి వాటికి మహర్దశ కల్పించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయనగరం నుంచే శ్రీకారం చుడుతున్నారని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో రూ.10.45కోట్లతో రహదారి మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గంగచోళ్లపెంటలో రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులతో పాటు పంచాయతీరాజ్, మున్సిపల్, జాతీయ రహదారుల అధికారులతో సిఎం సమీక్షిస్తారని తెలిపారు.

సిఎం పర్యటన ఇలా

- 11గంటలకు హెలి కాప్టర్‌లో గంగచోళ్లపెంట వద్దకు చేరుకుంటారు.
- 11.15 నుంచి 11.30 వరకు శిలాఫలకం ఆవిష్కరణ.
- 11.30 నుంచి 12 గంటల వరకు రహదారుల మరమ్మతులపై అధికారులతో సమీక్ష.
- 12.05 నుంచి 12.25 వరకు పురిటిపెంట వద్ద రహదారుల మరమ్మతు పనులు ప్రారంభం.
- అనంతరం గంగచోళ్ల పెంట వద్ద హెలీప్యాడ్ వద్దకు చేరుకొని 12.45కు విశాఖ వెళ్తారు.

ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత బందోబస్తు : ఎస్పి

చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో వెయ్యి మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. సిఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో రూట్ బందోబస్తు, రోప్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, రూట్ బందోబస్తు, హోల్డింగ్‌పాయింట్లను ఎస్పి పరిశీలించారు. రూట్ మరియు మూవింగ్ బందోబస్తు, నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ మార్గంలో ఎటువంటి వాహనాలు, మార్గాంటంకాలు లేకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. రూఫ్ టాప్ లపై విధులు నిర్వహించే భద్రత సిబ్బంది చుట్టూ ఉన్న ప్రాంతాలను బైనాక్యులర్స్ తో నిశితంగా పరిశీలించి, అనధికారంగా వ్యక్తులు ఎవ్వరూ బిల్డింగ్స్ మీద లేకుండా చూడాలన్నారు. మెంటాడ జంక్షను మీదుగా ముఖ్య నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రివ్యూ మీటింగులో పాల్గొనే ఇతర శాఖల అధికారుల వాహనాలను మాత్రమే అనుమతించాలన్నారు. రోప్ పార్టీలు ముఖ్యమంత్రి పర్యటనలో క్రియాశీలకంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు పి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, యూనివర్స్, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్.ఎస్.ఐ.లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు

పురిటిపెంట గ్రామం వద్ద రహదారి గుంతల మరమ్మత్తు పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో గజపతినగరం నుండి మెంటాడ వెళ్ళే అన్ని వాహనాలను మధుపాడ, భూదేవిపేట, కొత్త బగ్గాం, పాత బగ్గాం మీదుగా దారి మళ్లించారు. లేదంటే ఓలం జంక్షన్ నుండి బంగారమ్మ పేట, చల్లపేట మీదుగా మెంటాడ వెళ్లాలి. మెంటాడ నుండి వచ్చే వాహనాలు కొనిశ జంక్షన్ నుండి గజపతినగరం వచ్చేందుకు డైవర్ట్ చేస్తామని ఎస్పి తెలిపారు.

నాలా వారి భూములపై నారా వారు స్పందించేనా?

వారంతా పంట పండితే తప్ప కడుపు నింపుకోలేని పేద, నిరుపేద కుటుంబాల వారు. అరకొరగా ఉన్న ఆ భూమి రైతుల సాగులో 74ఏళ్లగా ఉన్నప్పటికీ ఆ భూములకు పట్టాలు లేవు. బ్యాంకర్లు ఎలాగూ రుణాలు ఇవ్వడం లేదు. కనీసం ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు కూడా పుట్టని పరిస్థితి. మరోవైపు రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సహక రాయితీలు వర్తించడం లేదు. భూమిపై హక్కు లేకపోవడంతో భూములు తాకట్టు పెట్టాలనుకున్నా ఎవరూ ముందుకు రాకపోవడంతో సకాలంలో పెళ్లిళ్లు, నలుగురిలా పండగలు చేసుకోలేని దుస్థితి దాపురిస్తోంది. ఇటువంటి గ్రామానికి సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారని తెలియడంతో ఆ రైతుల్లో ఆనందం వ్యకమవుతోంది. తమ సమస్యను అడిగితే ఆవేదనను వెళ్లగక్కుకుందామని. అడగకపోయినా మనసు విప్పిమాట్లాడుదామని ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ, ముఖ్యమంత్రి ఆ పేద రైతులతో అంత అప్యాయంగా మాట్లాడుతారా? ఒకవేళ ఏదో తెలుసు కుందామని ఆయన ప్రయత్నించినా సెక్యూరిటీ అధికారులు అందుకు సహకరిస్తారా? అన్నది వేచిచూడాల్సిందే. ఆ ఊరు మరేదో కాదు. సిఎం చంద్రబాబు నాయుడు శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో సందర్శించబోయే పురిటిపెంట.

పురిటిపెంటలో రైతుల సాగులో ఉన్న భూమి

- 70 ఏళ్లుగా పేదల సాగులో 265 ఎకరాలు
- న్యాయస్థానాలు తీర్పుఇచ్చినా పట్టించుకోని పాలకులు
- పురిటిపెంట సమస్యపై చంద్రబాబు చొరవ చూపేనా?

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/గజపతినగరం

గజపతినగరం నియోజకవర్గానికి వెన్నుముఖ లాంటి పురిటిపెంట గ్రామం (పాత పురిటిపెంట)లో 500 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సగానికి సగం మంది పేద, మధ్య తరగతి కుటుంబాల వారే. వీరిలో 296 మంది రైతులు పురిటిపెంట రెవెన్యూ పరిధిలోని 8, 9, 12, 15, 16, 17 తదితర సర్వే నెంబర్లలో 265 ఎకరాల నాలావారీ భూములను 1950వ దశకం నుంచీ సాగు చేస్తూ జీనవం సాగిస్తున్నారు. ఈ భూములపై సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 1970వ దశకం నుంచి 2006 వరకు సిపిఎం నాయకులు పాటూరి రామయ్య, బివి రాఘవులు, కీర్తిశేషులు ఆర్.కుప్పానాయుడు నాయకత్వంలో దఫదఫాలుగా ఉద్యమాలు సాగాయి. మరోవైపు ఆ పార్టీ ఆధ్వర్యంలోనే న్యాయ పోరాటం కూడా సాగింది. ఫలితంగా అనేక సందర్భాల్లో న్యాయస్థానాలు రైతులకు అనుకూలంగా తీర్పులు కూడా ఇచ్చాయి. ఈ భూములు రైతులకు దక్కుతాయని1979లో హైకోరు తీర్పు కూడా ఇచ్చింది. కానీ, నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతాన్ని ఏలే పాలకులు సాగుదారులకు మేలు చేయాలన్న రాజకీయ చిత్తశుద్ధి కనబర్చక పోవడంతో ఎక్కడి సమస్య అక్కడే నిలియిపోయింది.

మరోవైపు ఆంధ్ర జలాశయం నుంచి వచ్చే కాలువ గంగచోళ్లపెంట దాటాక ఇరువైపులా ఆక్రమణకు గురికావడంతో సాగునీరూ కరువైపోయింది. దీంతో, పంటలు సాగుచేయాలంటే ఆకాశంలో మబ్బులవైపు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాధారంతో పంటలు సాగుచేస్తున్నారు. అష్టకష్టాలు పడుతూ వరి, మొక్కజొన్న, ఇతర అపారాలు పండిస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. వరుణడు కరుణించినా, ఆగ్రహించినా అంతే సంగతులు. కనీసం ప్రభుత్వం నుంచి నష్టపరిహారంగానీ, బీమా సందుపాయంగా వర్తించే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ పార్టీలతో సంబంధం లేకుండా ఆ గ్రామంలోని రైతులంతా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగని చోటు లేదు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం చుక్కల భూములను సాగుదారులకు రెగ్యులర్ చేసినప్పటికీ నాలావారి భూముల విషయంలో సానుకూలంగా స్పందించలేదు. ఫలితంగా భూముల క్రయ విక్రయాలు జరగక, అప్పులు పుట్టక ఆర్థిక ఇబ్బందులతో పిల్లలకు సకాలంలో పెళ్లిలు కూడా చేయలేక రైతులు పడుతున్న కష్టనష్టాలు వర్ణణాతీతం. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామానికి వస్తున్న సిఎం చందబ్రాబు నాయుడు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రయ విక్రయాలు లేక ఇబ్బందులు పడుతున్నాం

ప్రభుత్వం రైతులకు పట్టాలు ఇవ్వకపోవడం వల్ల భూముల క్రయ విక్రయాలు జరగక పిల్లల పెళ్లిళ్లు, చదువులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. స్వాతంత్ర్యం రాకముందు నుంచి భూమిని సాగు చేసుకుంటున్నా పట్టాలు ఇవ్వడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నోఏళ్ల నుంచి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి పట్టాలివ్వాలి.

- సారికి బంగారునాయుడు, రైతు, పురిటిపెంట

ముఖ్యమంత్రి స్పందించి పట్టాలివ్వాలి

సుమారు 70ఏళ్లగా రైతులు సాగు చేసుకుంటున్న భూములకు టిడిపి కూటమి ప్రభుత్వమైనా స్పందించి పట్టాలివ్వాలి. ఈ భూమి రైతులకే చెందుతుందని హైకోర్టు తీర్పునిచ్చినా ఇంతవరకు ప్రభుత్వాలేవీ పట్టాలు ఇవ్వలేదు. గ్రామంలో అందరూ చిన్న చిన్న రైతులే అయినందున అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి విచ్చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు స్పందించి పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- గొర్లె బంగారునాయుడు, రైతు, పురిటిపెంట

ఎమ్మెల్యేది నియంతృత్వ పోకడ

పొత్తు ధర్మాన్ని విస్మరించడం సరికాదు • టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు

సమావేశంలో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి నియంతృత్వ పోకడలతో వ్యవహరిస్తున్నారని, వైసిపి నుంచి జనసేనలోకి వచ్చిన వారికి ప్రాధాన్యతనిచ్చి పొత్తు ధర్మాన్ని మరిచిపోతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లోని గ్యాస్ ఆఫీస్ వద్ద టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు కూడా హాజరయ్యారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. అనంతరం బంగార్రాజు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యేగా గెలిచిన లోకం నాగ మాధవి పొత్తు ధర్మాన్ని విస్మరించారని విమర్శించారు. ఇటీవల కేటాయింపులు చేసిన ఉపాధి హామీ పనుల్లో వివక్ష చూపించారని ఆరోపించారు. వైసిపి వారికి కేటాయించడంతోపాటు మనలోనే చిచ్చుపెట్టడానికి టిడిపి వారికి కూడా కేటాయింపులు చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తోందని, ఇలాంటి తరుణంలో మన సమస్యలతో పొత్తుకు తూట్లు పడకూడదని సంయమనం పాటిస్తున్నామని చెప్పారు. గతంలో ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఎదుర్కోక తప్పదని తెలిపారు. జరుగుతున్న పరిణామాల పట్ల కార్యకర్తలు ఆధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఐక్యంగానే ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, నియోజకవర్గం సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్, పతివాడ అప్పలనారాయణ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర రావు, పల్లె భాస్కరరావు, పార్లమెంటు అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యదర్శి లెంక అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తగ్గించిన పాల ధరను వెనక్కి తీసుకోవాలి

మంత్రి శ్రీనివాస్‌కు పాల రైతుల వినతి

మంత్రికి వినతి అందిస్తున్న పాలరైతుల సంఘం నాయకులు

ప్రజాశకి-విజయనగరం టౌన్

విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను వెనక్కి తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పాలరైతుల సంఘం నాయకులు రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం మంత్రిని పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి రాంబాబు, జిల్లా పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోక వరపు అదినారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి గొంప కృష్ణ మూర్తి, జామి జెడ్‌పిటిసి మాజీస భ్యులు బండారు పెదబాబు తదితరులు కలిసి వినతిని అందజేశారు. విశాఖడెయిరీకి ఉత్తరాంధ్ర జిల్లాల పాల రైతులు సుమారు 3.5 లక్షలమంది ప్రతి రోజూ 9లక్షల లీటర్లు పాలు పంపిస్తున్నారని తెలిపారు. పాల రైతుల కష్టార్జితంతో అభివృద్ధి చెందిన విశాఖ డెయిరీ సహకార రంగం నుండి కంపెనీల చట్టం లోకి మారి అనేక ఏళ్ల నుంచి వచ్చిన లాభాలు, ఆస్తులు యజమాన్యం అన్యాక్రాంతం చేస్తోందని తెలిపారు. తాజాగా రైతుల నుంచి సేకరిస్తున్న ఆవుపాల ధర తగ్గించి అన్యాయం చేశారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులకు న్యాయం జరిగేలా పాల ధర పెంచాలని కోరారు. ప్రతి నాలుగు నెలలకూ బోనస్ ఇవ్వాలని, డెయిరీని కంపెనీల చట్టం నుంచి సహకార రంగంలోకి తేవాలని, డెయిరీలో అవినీతిపై విచారణ చేపట్టాలని, కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడు అప్పారావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, పాల రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బుగత సునీల్, లక్కిడాం, నీలావ, పాల రైతు నాయకులు పవన్, ఎర్రి నాయుడు, వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

పాల రైతుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

శృంగవరపుకోట : పాల రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపి పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం లక్కవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాల రైతుల సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణ మూర్తి మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవుపాల ధరను వెనక్కి తీసుకోవాలని, డెయిరీకి వచ్చే లాభాలలో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆవు పాలు లీటర్‌కు రూ.50, గేదె పాలు లీటరుకు రూ.80 ఇచ్చి, దాణాలో 75 శాతం సబ్సిడీ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా నాయకులు మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, పాల సొసైటీ అధ్యక్షులు బొబ్బర అప్పల నాయుడు, సిహెచ్.దాలి, గొంప వెంకటరావు, తర్ని వెంకటరావు, చిన్నారావు, వజ్రపు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కుమిలి గ్రామస్తులు

మద్యం షాపు మార్చాలని నిరసన

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని కుమిలిలో గ్రంథాలయం వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయడంపట్ల ఆ గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామంలోకి వచ్చే రహదారి గుండా నిత్యం విద్యార్థులు, వ్యవసాయం చేసుకునే మహిళలు ఎక్కువగా ప్రయాణం చేస్తూ ఉంటారు. అటువంటి రహదారిలో మద్యం దుకాణం తెరవడం పై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, గ్రామ శివార్లులో పెట్టకుండా, గ్రంథాలయం దగ్గరగా పెట్టడం వలన, మద్యం సేవించిన మత్తులో మందుబాబులు వీరంగం చేస్తే ఎవరు బాధ్యులు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి, మద్యం దుకాణం వేరే దగ్గరకి మార్చాలని కోరుతున్నారు.

మద్యం షాపును త్వరగా తరలించాలి

బొబ్బిలి : మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే ప్రాంతానికి త్వరగా తరలించాలని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడును స్థానికులు కోరారు. ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం సిఐను స్థానికులు కలిశారు. మద్యం షాపు తరిస్తామని హామీ ఇచ్చినా నేటికీ తరలించలేదన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని వెంకట సీత, రమణమూర్తి, శిరీష, రోజా, సురేష్, సాయి అన్నారు. ఈనెల 12లోగా మద్యం షాపును తరలిస్తామని సిఐ హామీ ఇచ్చారు.

కెజిబివి నాన్ టీచింగ్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

విజయనగరం టౌన్ : కెజిబివిలో టీచింగ్, నాన్-టీచింగ్ (అకౌంటెంట్, వార్డెన్ పోస్టులకు మాత్రమే) పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్ జాబితా సిద్ధమైందని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. ఈ మెరిట్ లిస్టును Vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌లో శుక్రవారం ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రం 5 గంటల్లోగా నేరుగా అభ్యర్థులు వచ్చి తెలపాలని కోరారు.

పింఛన్ల కోసం పడిగాపులు

- 4 గంటల పాటు సర్వర్, సిగ్నల్ సమస్య
- సచివాలయ ఉద్యోగుల పాట్లు
- 12 గంటల వరకు మందకొడిగా పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

కొత్తవలస.. పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. దాదాపు నాలుగు గంటల పాటు సర్వర్ మొరాయించడం, సిగ్నల్ సమస్య కారణంగా ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది. సర్వర్ పనిచేయక సచివాలయ ఉద్యోగులు నానా పాట్లు పడ్డారు. 12 గంటల వరకు మందకొడిగా పింఛన్ల పంపిణీ సాగింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి-రేగిడి

విజయనగరం జిల్లాలో 2,77,079 ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ఉన్నాయి. ఈ పింఛన్లు సచివాలయ ఉద్యోగుల ద్వారా బట్వాడా చేసేందుకు అధికారు లు చర్యలు తీసుకున్నారు. రేగిడి మండలంలో 25 సచివాలయాల పరిధిలోని 39 పంచాయతీల్లో 10,729 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను సచివాలయ సిబ్బంది పంపిణీ చేయడం ప్రారంభించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సర్వరు పనిచేసింది. అనంతరం సాంకేతిక సమస్యతో నాలుగు గంటల పాటు సర్వర్ పనిచేయలేదు. దీంతో లబ్ధి దారులు ఉద్యోగుల చుట్టూ ప్రదక్షిణ చేశారు. కొన్ని సందర్భాలలో డాబాలు, మిద్దులు, ఎత్తయిన ప్రాంతాల పైకెక్కి పింఛన్లు పంపిణీ చేయాలని ప్రయత్నించారు. అయినా, సర్వర్ పని చేయక సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లిన ఉద్యోగులు ఊరు శివారులో పంపిణీ చేస్తున్నారు. మండలంలో చివరికి శుక్రారం సాయంత్రం ఐదు గంటలకు 10,070 పింఛన్లు (93.86 శాతం) నానా తంటాలు పడి పంపిణీ చేశారు. తునివాడ, లచ్చారాయపురం, కొర్లవలస, పనసలవలస గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎపిఎం బాసిన గోవిందరావు పరిశీలించారు.

ఉన్నతాధికారుల చొరవతో..

జిల్లాలో పింఛన్ల పంపిణీలో గంటల తరబడి సర్వర్ సమస్య వెంటాడింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు చొరవ తీసుకొని రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారు స్పందించి సాంకేతిక సమస్యను పరిష్కరించారు. దీంతో సజావుగా పింఛన్ల పంపిణీ సాగింది.

లబ్ధిదారులకు నానా కష్టాలు

మెరకముడిదాం : మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు సరిగా అందకపోవడం లబ్ధిదారులు నానా అవస్థలు పడ్డారు. గంటల తరబడి పింఛన్లు అందక పోవడంతో వృద్ధులు, వికలాంగులు పడిగాపులు కాయలేక ఇబ్బందులు పడ్డారు. రోజంతా సచివాలయాలు, సిబ్బంది చుట్టూ లబ్ధిదారులు తిరగడం కనిపించింది.

మొరాయించిన సర్వర్లు

కొత్తవలస : మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులు నానాపాట్లు పడ్డారు. ఉదయం ఏడు గంటల నుంచి సర్వర్ మొరాయించడంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో ఉద్యోగులతోపాటు లబ్ధిదారులు సిగ్నల్ ఎప్పుడు వస్తుందోనని పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొత్తవలస విఆర్ఓ రాధాకృష్ణ.. మరిడమ్మ దేవాలయం వద్ద సిగ్నల్ కోసం లబ్ధిదారులతో కలిసి సుమారు మూడు గంటల పాటు వేచి చూశారు. సాంకేతిక సమస్యను పరిష్కరించి పింఛన్ల పంపిణీని పునరుద్ధరించినట్లు ఎంపిడిఒ రమణయ్య తెలిపారు. సాయంత్రానికి 90 శాతం వరకు పంపిణీ చేసే అవకాశం ఉందన్నారు.

ఆశావర్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలి

డిఎంఅండ్‌హెచ్‌ఒకు ఆశా వర్కర్ల యూనియన్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుర్ల మండలం తెట్టంగి పిహెచ్‌సి నాగాళ్లవలస ఆశా వర్కర్ పూర్ణిమకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూఐ శుక్రవారం డిఎంఅండ్‌హెచ్‌ఒ భాస్కరరావుకు, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఇటీవల గుర్ల మండలంలో ప్రబలిన డయేరియా సందర్భంగా రోగులకు పూర్ణిమ విశేష సేవలు అందించారని తెలిపారు. ఆ నేపథ్యంలోనే అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చేరిందన్నారు. నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించి, అనారోగ్యం పాలైన పూర్ణిమకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, చంద్రకళ, దేవి, కొండమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు 10న స్క్రీనింగ్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సిలో ఉచిత శిక్షణకు ఈనెల 10 ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష జరుగుతుందని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు బి.రామానందం ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్‌సి పరీక్ష కోసం ఉచిత భోజన, వసతి సౌకర్యంతో కూడిన మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష ఈనెల 3న బదులు 10వ తేదీన జరుగుతుందని తెలిపారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌కు పోరాం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 3,4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరుగనున్న అండర్ 17 రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాలోని పోరాం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు కె.హేమలత (ట్రిపుల్ జంప్), టి.సురేష్ (షాట్ పుట్), కె.కీర్తన హై జంప్ ఈవెంట్లలో ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సన్యసినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కె. తవిటి నాయుడు లు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు పరిశీలకులుగా తవిటినాయుడు

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు పరిశీలకులుగా పోరాం జెడ్‌పి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు కొల్లి తవిటినాయుడు ఎంపికయ్యారు. ఆయన ఎంపిక పట్ల స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పూసపాటిరేగ హైస్కూల్ నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శంకరరావు తెలిపారు. క్రికెట్‌లో అండర్-14 విభాగంలో ఎం.కార్తీక్, ఎం.మహేష్, అండర్-17లో పి.మహేష్ ఎంపికయ్యారు. అండర్ -14 ఖోఖో పోటీలకు ఎ.ఉదయ్‌కుమార్, ఎ.అమృత ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎంతోపాటు పీడీలు జివిఎస్ వర్మ, పి.బాబ్జి, ఉపాధ్యాయులు అభినందించారు.

పంటలకు బీమాతోనే రైతుకు ధీమా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పంటలకు బీమా చేసినప్పుడే రైతుకు ధీమా ఉంటుందని ఉద్యానశాఖాధికారి అనిత అన్నారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రతి రైరూ వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా అవకాశం ఉందని, పంటల బీమా కోసం వన్‌బి, ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్సులతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న డిఇ మానస, అధికారులు

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి నుంచి చందులూరు వెళ్లే రోడ్డు నిర్మాణానికి శుక్రవారం పిఆర్ డిఇ మానస స్థల పరిశీలన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్ అంబేద్కర్‌కు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు వినతినిచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో డిఇ స్థల పరిశీలన చేశారు. మధ్యలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జితోపాటు కల్వర్టు నిర్మాణానికి తమ్మయ్యచెరువును పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.వెంకటరావు, ఎంపిటిసి ఆర్.రాజేష్, పంచాయతీ కార్యదర్శి సత్యవతి, సచివాలయ అసిస్టెంట్ లీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ గర్వపడేలా పథకాలు

సిలిండర్ల పంపిణీలో ఎమ్మెల్యేలు

బొబ్బిలి, శృంగవరపుకోటలో ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు బేబినాయన, లలితకుమారి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రాష్ట్రంలో పుట్టినందుకు ప్రతిఒక్కరు గర్వపడేలా ప్రభుత్వ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతిపక్షాలు అవహేళన చేశాయని చెప్పారు. వాటిలో ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో నాలుగు హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. గ్యాస్ బుక్ చేసుకొని డెలివరీ జరిగిన 48 గంటల్లో లబ్ధిదారు ఖాతాలో డబ్బులు పడతాయన్నారు. ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీను, సిఎస్ డిటి సాయికృష్ణ, టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, రామభద్రపురం నాయకులు సిహెచ్ రామకృష్ణ, తహశీల్దార్లు, సిఎస్ డిటిలు, డిటిలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : దీపం-2.ఒ పథకాన్ని పట్టణంలోని గ్యాస్ గోడౌన్ ఆవరణలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే రూ.25 రాయితీ పోను మిగిలిన రూ.876 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఎలాంటి సందేశాలున్నా టోల్ ఫ్రీ నంబర్ 1967 అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రతి మహిళ లబ్ధి పొందాలని, గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి టూరిజం కార్పొరేషన్ సభ్యులు ఇందుకూరి సుధారాణి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జిల లావాదేవీల్లో అవకతవకలు

ప్రజాశక్తి-బొబ్బిలి

అలజంగి గ్రామంలో 108 డ్వాక్రా గ్రూపుల (ఎస్‌హెచ్‌జి) లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని, దీనిలో సంబంధిత అధికారుల హస్తం కూడా ఉందని ఆ గ్రామ నాయకులు, డ్వాక్రా మహిళలు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మువ్వల శ్రీనివాసరావుకు విన్నవించుకున్నారు. ఈ విషయమై శుక్రవారం యూనియన్ బ్యాంకు అధికారులను ఆధారాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వల కలిశారు. అందులో కొంత మొత్తం అవినీతి జరిగిందని బ్యాంకు అధికారులు సమాధానమిచ్చారు. 2012 నుంచి నేటి వరకు జరిగిన డ్వాక్రా గ్రూపు లావాదేవీల్లో విఒఎ ఆధ్వర్యాన కోట్లాది రూపాయలు ప్రజల సొమ్ము చేతులు మారిందని స్పష్టంగా అర్థం అవుతుందని మువ్వల తెలిపారు. దీనిపై గతంలో వెలుగు, బ్యాంకు అధికారులకు విన్నవించుకున్నా చర్యలు తీసుకోలేదని చెప్పారు. అందులో వెలుగు అధికారులు హస్తం ఉన్నట్లు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి, ప్రజల సొత్తు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండపాక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

పింఛన్ల పంపిణీలో మంత్రి శ్రీనివాస్



మహిళకు పింఛను నగదు అందిస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గంట్యాడ మండలం నరవ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని, రాష్ట్ర ఎంఎస్‌ఎం, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఆయన స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. మంత్రి గ్రామంలో విస్తతంగా పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ. గత ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. గత ప్రభుత్వం గ్రామంలో ఒక్క రహదారిని గానీ, కాలువను గాని నిర్మించలేదని పేర్కొన్నారు. పారిశుధ్యాన్ని సైతం విస్మరించారని, గ్రామాలు పూర్తిగా చెత్తతో నిండిపోయాయని చెప్పారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్డఇఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, ఇతర మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యత

బొబ్బిలి : ఎన్నికల హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శుక్రవారం పట్టణంలో, మండలంలోని జిఎస్‌ఆర్‌పురం గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సామాజిక పింఛన్ల సొమ్మును ప్రభుత్వం పెంచిందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులందరికీ పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ పి.గౌరి, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపిడిఒ రవికుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, ఎపిఎం భాగ్యలక్ష్మి, సర్పంచి జి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలోని అంబటివలస గ్రామంలో శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీని ఎంపిడిఒ జి.గిరిబాల పరిశీలించారు. ఈ మేరకు పింఛన్ల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సి.హెచ్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో వావిలపాడులో సామాజిక పింఛన్లు పంపిణీని ఎంపిడిఒ సూర్యనారాయణ పరిశీలించారు. సర్వరు పనిచేయక కొంత ఇబ్బంది ఎదురైనా, తర్వాత సక్రమంగా పంపిణీ కావడంతో ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

మండల మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రంగరాయపురంలో శుక్రవారం సిపిఎం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో ప్రజలపై భారాలు పడుతున్నాయని, తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. ఏడాదికి 200 పని దినాలు కల్పించి, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూతపడిన పరిశ్రమలు తెరిపించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వీటిపై మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం సిపిఎం మండల కన్వీనర్‌గా ఎస్.గోపాలం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ, పి.శంకరరావు, మండల కమిటీ సభ్యులు జి.అప్పలనాయుడు, యు.ప్రసాద్, రెడ్డి త్రినాథ, ఎం.పరశురామ్ పాల్గొన్నారు.

ఆప్ జిల్లా కన్వీనర్‌గా రమేష్‌రాజు

రాజుకు నియామకపత్రాన్ని అందిస్తున్న రమేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జిల్లా కన్వీనర్ గా న్యాయవాది డాక్టర్ రమేష్ రాజును నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్ ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో రమేష్‌కురాజుకు అందజేశారు. అనంతరం విలేకరులతో రాష్ట్ర కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ ఆప్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆయనపై బిజెపికార్యకర్తలు దాడికి పాల్పడ్డారని, వారిని తక్షణమే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నగర కన్వీనర్ నయీమ్ ఎండి, నియోజకవర్గ కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, జిల్లా యూత్ కన్వీనర్ తాళ్లూరు వెంకట్ పాల్గొన్నారు.

క్రీడా రంగంపై మక్కువ పెరగాలి

ఎమ్మెల్యే బేబినాయన

టేబుల్ టెన్నిస్ ఆడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-రామభద్రపురం

క్రీడా రంగంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన సూచించారు. మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టేబుల్ టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన ముల్లు చంద్రశేఖర్ రూ.45వేలతో ఈ క్రీడా పరికరాలను కొనుగోలు చేసి పాఠశాలకు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలకు ఆటస్థలం సమస్య ఉందని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రావాడ భాస్కరరావు.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా బేబినాయన విద్యార్థులతో కొద్ది సేపు టేబుల్ టెన్నిస్ ఆడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, కరణం విజయభాస్కరరావు, ముల్లు రాంబాబు, బెవర సీతారాం, తహశీల్దార్ సులోచనరాణి, ఎంపిడిఒ రత్నం, పిఇటి బొత్స రత్నకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ మేళాలో విజేతలుగా 'రామతీర్థం' విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెహ్రూ యువకేంద్రం, సెట్విజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ మేళాలో రామతీర్థం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అర్.యశ్వంత్, యాప్ డిజైనింగ్‌లో మొదటి స్థానం, పి.మహేష్ బాబు యాంటి రిగ్గింగ్ ఓటింగ్ మిషన్ ను తయారు చేసి ప్రదర్శించడంలో విజేతగా నిలిచారు. వీరికి గైడ్‌గా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు వ్యవహరించారు. విద్యార్థులకు సెట్విజ్ సిఇఒ, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక భవిత కేంద్రానికి రావివలస ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయుడు మాదల సింహాచలం రెండు ఫ్యాన్లు వితరణగా అందజేశారు. తన కుమారుడు గణేష్ పుట్టినరోజును అక్కడి విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య చేతుల మీదుగా ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పి చింతల రాజేశ్వరి, తేజస్విని పాల్గొన్నారు.

ఉపాధి నిధులు అప్పగించాలని సర్పంచుల వినతి

ఎంపిడిఒకు వినతి అందిస్తున్న సర్పంచులు

ప్రజాశక్తి-డెంకాడ

ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ నిధులు తమకు అప్పగించాలని మండలంలోని సర్పంచులు ఎంపిడిఒకు శుక్రవారం వినతి అందించారు. అనంతరం వైస్ ఎంపిపి తమ్మినాయుడు మాట్లాడుతూ తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కూటమి నాయకులకు చట్ట వ్యతిరేకమన్నారు. ఎంపిడిఒ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బడుకొండ లక్ష్మి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కనక సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని జిన్నాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు దూరప్రాంతాల నుంచి వస్తున్న తల్లి, తండ్రి లేని విద్యార్థులకు అమెరికాకు చెందిన వి.కె ట్రస్ట్ 14 సైకిళ్లను అందజేసింది. వీటిని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సిద్ధాంతం త్రినాథరావు పంపిణీ చేశారు. సైకిళ్లు వితరణ చేసిన వికె ట్రస్ట్, బాడంగి స్పెషల్ ఎడ్యుకేటర్ కొల్లి ఈశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. అపార్ నమోదు వేగవంతం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ వల్లి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేయిస్తున్న ఇఒపిఆర్‌డి రామారావు

తలగాంలో వాటర్ ట్యాంకు శుభ్రం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వంగర

తలగాం గ్రామంలో తాగునీటి ట్యాంకు క్లోరినేషన్ చేపట్టక పోవడంపై ఇటీవల 'సురక్షితమేనా?' అనే కథనం ప్రజాశక్తిలో రావడంతో అధికారులు స్పందించారు. తాగునీటి ట్యాంకును ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం శుభ్రం చేశారు. క్లోరినేషన్ పనులు చేపట్టారు. వాటర్ ట్యాంకు పైకప్పు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం 3వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మరియు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు
OS. 616/2021

Between:
దువ్వు శ్రీకాంత్ .....Plaintiff
And :
బైరి శివ సంతోష్ కుమార్ .....Defendant
To
బైరి శివ సంతోష్ కుమార్, S/o **సూర్యనారాయణ**, R/o **హౌస్ నెం.33, శాలిపేట, కంటోన్మెంట్, విజయనగరం**

పై నెంబరు కోర్టునందు వాది దావా నమోదు చేయగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన ప్రకారం ఈ నోటీసు పంపించడం జరిగింది. ఈ దావా తేది 30-12-2024 ఉదయం 10-30 ని॥లకు మీరుగాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

కె.రవిబాబు
అడ్వకేట్, విజయనగరం,
సెల్ : 9440343921

సముద్రంలో గల్లంతైన బాలుడు మృతి

ప్రజాశక్తి-భోగాపురం

దానయ్య (ఫైల్)

మండలంలోని కొండ్రాజుపాలెం సముద్ర తీరంలో గురువారం గల్లంతైన మత్స్యకార బాలుడు మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. చినకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన గనగళ్ల తాతయ్య, దానమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు దానయ్య (15) రామచంద్రపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు సముద్రతీరానికి వెళ్లగా అలల తాకిడికి కొట్టుకుపోయాడు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి సముద్రంలో మత్స్యకారులంతా వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం బాలుడి మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం మాధవి బాలుడి తల్లిదండ్రులను పరామర్శించారు. టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ కూడా బాలుడు తల్లితండ్రులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

నేరాలు ఘోరాలు

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న ప్రైవేటు బస్సు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని పూల్‌బాగ్ అయ్యప్పనగర్ వద్ద శుక్రవారం ఆర్‌టిసి బస్సును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుకవైపు ఢీకొంది. స్పీడ్ బ్రేకర్ దాటుతున్న సమయంలో ఒక్కసారిగా వెనుక నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సు డ్రైవర్ బ్రేకింగ్ కంట్రోల్ చేయలేక ఢీకొన్నాడు. దీంతో ఆర్‌టిసి బస్సులో ప్రయాణికులు బస్సులో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. బస్సులో ఉన్న ప్రయాణికులు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వారికి ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై విజయనగరం ఆర్‌టిసి డిపో మేనేజర్ జె శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రయాణికులకు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని అన్నారు .

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరంకోట

మండలంలోని ధర్మపురి గ్రామంలో దాడులు నిర్వహించి ఒక వ్యక్తి 9 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. పేర్నింకి అప్పలనాయుడుపై కేసు నమోదుచేశారు. దాడిలో హెచ్‌సి నాగేశ్వరావు, ఇసిలు ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు వైన్‌షాపులు కేటాయించాలి

బొబ్బిలి : ఎస్‌సి, ఎస్‌టిలకు మద్యం షాపులు కేటాయించాలని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సౌరు సాంబయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై గజపతినగరం వస్తున్న సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT) VIZIANAGARAM
O.S. 321/2022 & in I.A. 324/2022

Between:
Lanka Narayanappadu and others....Plaintiffs
And:
Lanka Sriramulu and others ......Defendants
To
D-2: Lanka Parasaya, S/o late Guruvulu, Residing at Jogirajupeta Village, Nellimarla Rev. Mandal, Vizianagaram District.
D-3: Lanka Ramunaidu, S/o Parasaya, Residing at Jogirajupeta Village, Nellimarla Rev. Mandal, Vizianagaram District
D-4: Lanka Appalanaidu, S/o Parasaya, Residing at Jogirajupeta Village, Nellimarla Rev. Mandal, Vizianagaram District

NOTICE

Take notice that the plaintiff/petitioner filed the above suit for Declaration and Permanent Injunction in which you are the defendants/ respondents and the said suit/petition stands posted to 22-11-2024 for notice to you. If you got any objection in the above suit/petition you can appear in person or through an advocate and file your objections if any on **22-11-2024 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Plaintiff
Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT) VIZIANAGARAM
O.S. 188/2019

Between:
Pyadi Venkata Rao ......Plaintiff
And:
Smt. Pydi Manorama and others ....Defendants
To
D-7: Chegondi Vijaya Veera Venkata Satyanarana Murthy, S/o Hari Rama Jogayya, aged 58 years, Hindu, Residing at Siripuram Village, Gantyada Rev. Mandal, Vizianagaram District.

NOTICE.

Take notice that the plaintiff filed the above suit for partition of the suit schedule properties in which you are the 7th defendant and the said suit stands posted to 22-11-2024 for notice to you. If you got any objection in the above suit you can appear in person or through an advocate and file your objections if any on **22-11-2024 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Plaintiff
Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE VIZIANAGARAM
O.S. 19/2024 & in I.A. 18/2024

Between:
Sumala Satyam Naidu .....Plaintiff
And:
Smt. Pediredla Mahalakshmi and others ......Defendants
To
D-3: Pediredla Chaitanya @ Chinnu, S/o late Narayana Patrudu, Aged 24 years, Hindu, Residing at MIG-Plot No. 225, Mahalakshmi Nilayam, Phase-III, VUDA Colony, Vizianagaram.

NOTICE

Take notice that the plaintiff filed the above suit for recovery of an amount of Rs. 6,55,200/- due under the promissory note dated 08-03-2021 in which you are the 3rd defendant/ respondent and the said suit/petition stands posted to 27-11-2024 for notice to you. If you got any objection in the above suit/petition you can appear in person or through an advocate and file your objections if any on **27-11-2024 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Plaintiff
Vizianagaram

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి. అండ్ యస్.టి) వారి కోర్టు, శ్రీకాకుళం
ఐ.ఎ.274/2024 ఓ.ఎస్.50/2021

1) మర్రాపు లీలా మోహన్
2) భవిరిపూడి శ్రీరామమూర్తి నాయుడు
.......పిటిషనర్లు/వాదులు
మరియు :
రెడ్డి అప్పల నాయుడు వగైరాలు
......రెస్పాండెంట్లు/ప్రతివాదులు

5వ రెస్పాడెంట్/ ప్రతివాది :
రౌతు సరళ కుమారి, వయస్సు సుమారు 45 సం॥లు, భర్త సత్యం, నివాసము : కంచరాం గ్రామం, రాజాం మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు అయిన మర్రాపు లీలామోహన్ వగైరా మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి. అండ్ యస్.టి) వారి కోర్టు, శ్రీకాకుళంలో దాఖలు చేసిన దావా ఓ.యస్. నెం.50/2021 నెంబరు దావాలో మీరు 5వ రెస్పాండెంట్/ప్రతివాదియై ఉన్నారు. సదరు దావాలో నోటీసులు జారీ కాబడినప్పటికి మీరు నేటి వరకు హాజరు కానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయంపించి యున్నారు. మీ తండ్రి గారు అనగా 1వ ప్రతివాది ఈ దరిమిలా కాలము చేసినందున మీ తండ్రి గారి వారసులను చేర్పించుటకు వేసిన పిటిషన్‌లో కూడా పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయంపించి యున్నారు. సదరు దావా తే.25.11.2024 నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలో నున్నూ, అందలి వారసులును చేర్చమని దాఖలైన పిటిషన్‌లో మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్‌మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహ పై వాయిదా తేదీన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదీన హాజరు కాకుండ తప్పిపోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎం. బెనర్జీ, ఏడ్వొకేట్,
బొబ్బిలి, విజయనగరం జిల్లా.
సెల్ నెం. 9440592366